ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
గురువారం | 21 మార్చి, 2024 | పేజీలు : 5



ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ దాసరి హరిచందన 2 లో

# అంతా రామమయం...

## ఆధ్యాత్మిక సంద్రంలో కోదాడ

### కోదండ రామాలయం పునః ప్రతిష్ఠ మహోత్సవానికి పోటెత్తిన భక్తులు

### జనంతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

### వేలాదిమందికి అన్నదానాలు



**ప్రజాపక్షం / కోదాడ:** పట్టణంలో నడిబొడ్డున గల చారిత్రాత్మక కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి నియోజకవర్గవ్యాప్తంగా జనం వేల సంఖ్యలో పొటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుండి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. వేదపండితులు,పురోహితులు ప్రతిష్ట మహోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాలు శాస్త్ర యుక్తంగా నిర్వహిస్తుండగా జనం పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించిపోయారు.దేవతామూర్తులను దర్శించుకుని తరించిపోయారు. వేలాదిమంది ఆలయ దర్శనానికి రావడంతో ఆలయం జనంతో కిటకిటలాడింది. పట్టణంలోని ప్రధాన రహదారులన్ని ఎటు చూసినా మహిళలతో, పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. ఆధ్యాత్మిక సంద్రంలో కోదాడ పట్టణం మునిగితేలింది. స్వామివారి దర్శనం అనంతరం పట్టణంలో నలుమూలల 7 అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.అన్నదాన కేంద్రాల వద్ద వేలాది మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద తరువాయి 2లో

## ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుంటే

# మిల్లులను సీజ్ చేస్తాం..

### రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర చెల్లించకుండా సకాలంలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేసే మిల్లులను సీజ్ చేస్తామని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గూడూరు, వెంకటాద్రి పాలెం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్టాన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యేందుకు వస్తున్న ఆయన మార్గమధ్యలో మహర్షి రైస్ మిల్లు వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆగి వారి వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మిల్లర్లు సిండికేట్‌గా మారి మద్దతు ధర ఇవ్వడం లేదని, సకాలంలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలపడంతో స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అధికారులను పంపి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. మహర్షి మిల్లును సీజ్ చేయాలంటూ ఆదేశించారు. గూడూరు సీతారామాంజనేయస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమది ప్రజా, రైతు ప్రభుత్వమని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని తీవ్ర స్వరంతో మిల్లర్లను ఆదేశించారు. ఇప్పటికే అనేకసార్లు స్థానిక ఎమ్మెల్యే బీఎల్ఆర్, జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించి మిల్లర్లను హెచ్చరించినా తీరు మార్చుకోవడం లేదని, ధాన్యం కొనుగోలులో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఇది పద్ధతి కాదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కరువును కాంగ్రెస్ తెచ్చిందనడం మతిస్థిమితం లేని తరువాయి 2లో

## రాయిపల్లి దేవాలయంలో పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్



**ప్రజాపక్షం / ఆత్మకూర్ (ఎం):** మండలంలోని రాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీ బీరప్ప కామరాతి, మహంకాళి బుగ్గ పోచమ్మ దేవాలయానికి గడప ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్, వైస్ ఎంపీపీ భాషబోయిన పద్మ పాపయ్యయాదవ్, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, గుట్ట ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు,జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరసరుపు యాదగిరి గౌడ్, ఆత్మకూర్ తాజా మాజీ సర్పంచ్ నగేష్, పిఏసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు: బత్తిని ఉప్పలయ్య గౌడ్, పరకాల అంజయ్య గౌడ్, గుండెగాని ఐలయ్య గౌడ్, పోతగాని మల్లేశం గౌడ్, రాయిపల్లి మాజీ సర్పంచులు: జెట్ట శ్రీశైలం,ధనుంజయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు జెట్ట వెంకన్న, పెద్ద కురుమ జెట్ట చంద్రయ్య,మాజీ అధ్యక్షులుజెట్ట మల్లయ్య,అదే సాయిలు,రాయిపల్లి కురుమ కులస్తులు రాయిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అంతా రామమయం...



(మొదటి పేజీ తరువాయి)
ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉదయం నుండే ఆ రహదారి గుండా వాహనాలను నిలిపివేశారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

**కిటకిటలాడిన బట్టల దుకాణాలు:** ప్రతిష్ఠ మహోత్సావాల సందర్భంగా కోదాడ వాసులు ఇతర గ్రామాల్లో ఉన్న బంధుమిత్రులను ఇండ్లకు ఆహ్వానించి బట్టలు పెట్టాలని సాంప్రదాయం ఉన్నందున పెద్ద ఎత్తున బంధుమిత్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా చీరసారెలు కొనుగోలు చేసేందుకు జనం బట్టల దుకాణాలపై ఎగబడ్డారు. దీంతో బట్టల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి.

**బంధుమిత్రులతో కళకళలాడిన ఇండ్లు :** ప్రతిష్ఠ మహోత్సవాలకు కోదాడ వాసులు బంధువులను, మిత్రులను ఆహ్వానించడంతో ఏ వీధిలో ఏ ఇంటిలో చూసిన బంధువులతో ఇండ్లు కిటకిటలాడుతున్నాయి. పిండి వంటల గుమగుమలు ఆయా వీధుల్లో వస్తున్నాయి. కోదాడ మొత్తం పండుగ వాతావరణం అలుముకుంది.

**అందరి సహకారంతో విగ్రహ ప్రతిష్ఠ విజయవంతం – ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా**

పట్టణంలోని శ్రీకోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు అందరి సహాయ సహకారాలతో విజయవంతమయ్యాయని ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా, కోదండరామస్వామి ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు వెల్లడించారు. స్వామివారి కృపతో అన్ని కార్యక్రమాలు నిర్విఘ్నంగా వేదపండితుల శాస్త్రయుక్త వేద మంత్రోచ్చారణలతో జరిగాయన్నారు. లోకకళ్యాణం కోసం ఈ మహా ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆలయ నిర్మాణం నుండి ప్రతిష్ఠ మహోత్సవం వరకు ఆర్థికంగా సహకారం అందించిన దాతలకు, భక్తులకు, ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పునర్‌నిర్మాణం ప్రతిష్ఠ మహోత్సవం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 80వేల మంది వరకు అన్నదానం నిర్వహించామని మహా అన్నదానానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 102 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

### ఎస్ఐ ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం / శాలిగౌరారం:** పేదలకు దక్కవలసిన పిడిఎఫ్ బియ్యం దళారులు పక్కదారి పట్టిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని సొల్లగూడెం గ్రామ శివారులో పిడిఎఫ్ బియ్యంతో వెళ్తున్న డీసీఎంను శాలిగౌరారం ఎస్ఐ వాస ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో పట్టుకొన్నారు.అనంతరం సమాచారాన్ని సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్ జ్యోతికి తెలియజేశారు. అనంతరం కేసు నమోదు చేసి 102 క్వింటాల పిడిఫ్ సివిల్ సప్లై అధికారి జ్యోతికి అప్పగించారు. అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని, నిందితుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.

## మిల్లులను సీజ్ చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)
మాటలన్నారు. బీఆర్ఎస్ దిగిపోతూ కరువును ఇచ్చి పోయిందన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఎన్నో కష్టాలు పడి పంట పండించిన రైతుకు మద్దతు ధర చెల్లించకపోతే సహించేది లేదన్నారు. మిల్లర్లను ప్రభుత్వం ఎన్నో రకాలుగా ఆదుకుంటుందని, సన్నబియ్యంను ఇష్టారీతిగా ధరలు పెంచి అమ్ముకుంటున్నా చూసి చూడనట్లుగా వదిలేస్తున్నామన్నారు. మిల్లర్లు తమ తీరు మార్చుకోకపోతే మిల్లులను సీజ్‌చేస్తామని, అవసరమైతే ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. కాసుల కక్కుర్తితో జగన్ దగ్గర మోకరిల్లి కృష్ణ, గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించి ప్రాజెక్టులు ఖాళీ చేసి దక్షిణ తెలంగాణాను నాశనం చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు. అయినా కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చౌకబారు వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పంట నష్టంపై అధికారులతో అంచనా వేసి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, నాయకులు స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, అర్జున్, గాయం ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిఆర్సి మరియు రిసెప్షన్ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ భద్రత, వాహనాల పార్కింగ్ సామర్ధ్యం, తదితర వివరాలకు జిల్లా కలెక్టర్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కొండభీమనపల్లి పరిధిలో ఉన్న అవుట్ డోర్ స్టేడియాన్ని సైతం ఆమె పరిశీలించారు. అనంతరం డిండి రోడ్‌లో ఉన్న గిరిజన మహిళ డిగ్రి కళాశాల హాస్టల్ క్యాంపస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడమే కాక, హాస్టల్‌లో సౌకర్యాలు, లైబ్రరి, వంటశాల తదితర వాటిని తనిఖీ చేశారు. హాస్టల్ క్యాంపస్‌ను



పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, దేవరకొండ ఆర్డివో శ్రీరాములు, తహశీల్దార్ సంతోష్‌కిరణ్, మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

## విష జ్వరాల దృష్ట్యా మెడికల్ క్యాంపు

**ప్రజాపక్షం / డిండి:** విష జ్వరాలను దృష్టిలో ఉంచుకొని బుధవారం డిండి మండల పరిధిలోని కాల్య తండా, బొగ్గులదోన గ్రామాలలో మండల వైద్యాధికారి డా. శైలి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఒక్కరి వద్దకు వెళ్ళి వారి వివరాలను తీసుకొని పరీక్షలు నిర్వహించారు. జ్వరం, దగ్గు, జలుబు, డెంగ్యూ జ్వరం ఉన్న ప్రతి ఒక్కరు పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. రెండు రోజులు మెడికల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరు వైద్యులను సంప్రదించి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో సూపర్‌వైజర్ శ్రీనివాస్‌చారి, విజయలక్ష్మి , ఏఎన్ఎం హవిల్‌జాయ్, ఆయాలు జరీనా, మోతీ, సైదమ్మ పాల్గొన్నారు.



## సిఎం పిఆర్ఓ శ్రీనివాస్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన లింగంగౌడ్

**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంఘాల అధికారిగా నియమితులైన మిర్యాలగూడ మండల ఊట్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు వి.శ్రీనివాస్‌రావు నియమితులు కాగా ఆయనను బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 20 సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ నిబద్ధతో పనిచేస్తున్న శ్రీనివాస్‌కు సీఎం పీఆర్‌వో దక్కడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జి.రవి, గుంటి మహేష్ పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/ శాలిగౌరారం:** మూసి వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని శాలిగౌరారం ఎస్ఐ వాస ప్రవీణ్ కుమార్ విలేకరులకు తెలిపారు. నల్లగొండ జిల్లా ,శాలిగౌరారం మండల పరిధిలోని మూసి వాగు పరివాహక ప్రాంతమైన వంగమర్తి గ్రామం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం ఎస్ఐ తన సిబ్బందితో పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఆభయహస్తం కాదు భస్మాసురాస్తమే: సంకినేని



**ప్రజాపక్షం / తుంగతుర్తి:** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆభయ హస్తం కాదని భస్మాసుర హస్తమేనని బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, భువనగిరి పార్లమెంట్ బిజేపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మొయిన్‌రోడ్డులో బిజేపి పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. దేశం సుభిక్షతంగా ఉండాలంటే అభివృద్ధి జరగాలన్న మోడీ తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఇప్పటికే పనులు బోర్లు, చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, కరెంట్ కష్టాలు కూడా వచ్చాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రానికి, దేశానికి ఉపయోగం ఉండదని అన్నారు. ఈసందర్భంగా మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్‌తో బంగారు భువనగిరిగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. గతంలో నేను ఎంపిగా ఉన్నప్పుడు అభివృద్ధి చేయడమే కాకుండా తనహాయంలో 900 కోట్లతో అభివృద్ధి కోసం కృషి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు కాస రవికుమార్, కత్తులనరేష్, మల్లెపాక సాయి బాబా, ఉప్పుల లింగయ్య, అంబటి రమేష్, యాదగిరి, శ్యామ్, బిజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానం చేపట్టండి



**ప్రజాపక్షం / సూర్యాపేట కలెక్టరేట్:** జిల్లాలో మిగిలిఉన్న ఉపాధి కూలీల బ్యాంకు అకౌంట్, ఆధార్ అనుసంధానం సత్వరమే చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ సంబంధిత అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన డిఆర్‌డిఓ సిబ్బంది పోస్టల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరువేసవిలో ఎక్కువ పనులు కల్పించాలని సూచించారు. .జిల్లాలో ఇంకా 8925మంది ఉపాధి హామీ పనులు కల్పించాలని, బ్యాంక్ అకౌంట్, ఆధార్ అనుసంధానం చేయాలని కోరారు. ఈ పనులను సత్వరమే పూర్తి చేసి కూలీలకు సకాలంలో వేతనాలు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ జి.మధుసూదన్‌రాజు, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆడుతూ పాడుతూ సమస్యలు వివరిస్తూ...

**ప్రజాపక్షం/ హాలియా:** గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ఆడుతూ పాడుతూ వాటిని పరిష్కరిస్తూ గ్రామస్తులను చైతన్యవంతం చేసేలా విద్యార్థులు చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమం ప్రజల్ని చైతన్యవంతులు చేస్తుంది. హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గత ఐదు రోజులుగా హాలియా మున్సిపాలిటీ ఇబ్రహీంపేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను ఆడుతూ పాడుతూ వాటిని పరిష్కరిస్తూ గ్రామస్తులను వివిధ అంశాలపై చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం కార్యక్రమంలో విద్యార్థులు శుభ్రత పరిశుభ్రత, ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రంలోనూ, ప్రధాన వీధుల్లో నెలకొన్న చెత్తను పరిశుభ్రత చేస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు చేపడుతున్న ఈ కార్యక్రమాలను ప్రజలు ఆసక్తికరంగా తిలకిస్తూ వారి ద్వారా వివిధ అంశాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు.

# షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**ప్రజాపక్షం / నాంపల్లి:** ఆడ పిల్లలను వేదించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన ఫోటోలు, విడియోలు సోషల్ మీడియాలో మార్ఫిడి చేసిన తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన శిక్షలు విధించబడతాయని నాంపల్లి పోలీసులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్, సోషల్ మీడియాపై పిల్లలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షీ టీమ్ ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకే ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరిగిందిని, ఆపద సమయంలో 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందిచాలని సూచించారు. ఈకార్యక్రమంలో గాంధీజీ విద్యా సంస్థల చైర్మన్,




ట్రస్మా జిల్లా అధ్యక్షులు డా. కోడి శ్రీనివాసులు, పాఠశాల డైరెక్టర్లు వెంకన్న, నాగరాజు, ప్రిన్సిపాల్ బంధనాథం, సురేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏను కలిసిన కొల్లూరు కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం / ఆలేరు :** ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన కోటగిరి మనోజ్ లక్ష్మణ్ సోదరి శ్రీవాణి రాజశేఖర వివాహ వేడుకలకు హాజరుకావాలని బుధవారం ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గాజుల దశరథ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషకాలు సక్రమంగా తీసుకోవాలి

**ప్రజాపక్షం / ఆలేరు :** అంగన్వాడి కేంద్రంలో పోషక పదార్థాలు గర్భిణీ స్త్రీలు చిన్నారులు సక్రమంగా తీసుకోవాలని అంగన్వాడి టీచర్ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు పౌష్టికాహారం లభిస్తుందని తెలిపారు. గర్భిణీ స్త్రీలు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిరోజు తల్లులు అంగన్వాడి కేంద్రంలో భోజనం చేయాలని అన్నారు. టిహెచ్ఆర్ పిల్లలకు ఒక నెలకు 16 గుడ్లు బాలామృతం ఇస్తామని చెప్పారు. ఈ సంఘ బంధం అధ్యక్షులు మాధవి, విబికే ప్రమీల, గర్భిణీలు అశ్విని, శిరీష, బాలింత స్వప్న, ఆశ వర్కర్ లక్ష్మి , పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయ శంకుస్థాపన



**ప్రజాపక్షం / ఆలేరు :** ఆలేరు మండలం బహదూర్ పేట గ్రామంలో దుర్గమ్మ తల్లి ఆలయ భూమి పూజకు ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరై బుధవారం ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, మాజీ సర్పంచ్ కూల నర్సింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుండే సంపత్, కౌన్సిలర్ రాయపురం నరసింహులు, నాయకులు వల్లపు ఉప్పలయ్య, మల్లెల శ్రీకాంత్, అంగడి అంజి, కుల్లా సిద్ధులు, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

**ప్రజాపక్షం / అడ్డగూడూరు:** భువనగిరి పార్లమెంటు ఒక సారి ఎంపి అయి 5 ఏండ్లలో 9000 వేల కోట్లతో అబివృద్ధి చేసానని ఎవరు చేయని అబివృద్ధి చూసి ఆశీర్వదించాలని మాజీ పార్లమెంటు సభ్యులు, బిజెపి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఓ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ కులాల ప్రతినిధులతో సమావేశమై ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదీ మూడో సారి ప్రదాని కావాలని, సమర్ధవంతమైన ప్రధాని నరేంద్రమోడీ నేనని. దేశంలో 400 పార్లమెంటు స్థానాలు బిజెపి కైవసం చేసుకుంటుంది అందులో భువనగిరి ఉండాలని కోరారు. ఎండిన వరి పంటలను పరిశీలించాను భూగర్భజలాలు లేక విద్యుత్ సరిగా లేక ఎండుతున్నాయి. వాగుల్లో ఇసుక తోడటంతోనే భూగర్భజలాలు వట్టిపోయాయని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రజలు కాంగ్రెస్ ను ఆదరించినట్టు పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ కు ఓటేస్తే



ఉపయోగంలేదు ,కాంగ్రెస్ కు వేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు, అందుకే బిజెపి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ నిర్మించిన యాదాద్రి నిర్మాణ ఎంత, బిజెపి అయోధ్యలో నిర్మించిన రామాలయం ఖర్చు ఎంత అంటే యాదాద్రి ఖర్చునే ఎక్కువ అంటే దేవుని పేరుతో కూడా అవినీతి జరిగిందని ఆరోపించారు. బిజెపి తుంగతూర్తి నియోజకవర్గ కన్వీనర్ కడియం రామచంద్రయ్య, బిజెపి మండల పార్టీ అద్యక్షులు ననుబోతు సైదులు, జిల్లా నాయకులు కూరాకుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కులాల ప్రతినిధులు, ఆర్ఎంపి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం, సుద్దాల గ్రామాలలో బుధవారం పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం జరిగింది. సుమారు 278 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డా. ప్రత్యూష తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు టీకాలపై ఎటువంటి అపోహలకు పోకుండా ప్రతి



ఒక్క పశువుకు గాలికుంటు టీకాలను ఇప్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. యాకుబ్, గోపాల మిత్రలు గోవింద్, నరేష్, శేఖర్, శ్రీను, కృష్ణ, సోమశేఖర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం / నాంపల్లి:** ఉమ్మడి నల్గొండ జిల్లా కార్మికోద్యమ నాయకులు కామ్రేడ్ తిరందాసు గోపి స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులపై చేస్తున్న దాడికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు నాంపల్లి చంద్రమౌళి పిలుపునిచ్చారు. బుధవారం మండల




కేంద్రంలోని సిఐటియూ కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా సిఐటీయూ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ తిరందాసు గోపి7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగిన అనేక కార్మిక సమ్మె పోరాటాలలో ముఖ్యమైన పాత్ర నిర్వహించిన గొప్ప కార్మిక నాయకుడు తిరందాసు గోపి అని కొనియాడారు. కార్మిక వర్గాన్ని చీలికలు పేలికలు చేయడానికి కుల మత ప్రాంతీయ తత్వాలను రెచ్చగొడుతూ భావోద్వేగాలతో రాజకీయాలు చేస్తుందని వీటికి వ్యతిరేకంగా గోపి స్పూర్తితో కార్మిక వర్గం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని గద్దెదించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని 73 షెడ్యూల్ పరిశ్రమల్లో విడుదల చేసిన కనీస వేతనాల జీవోలను సవరించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(సిఐటీయూ) మండల నాయకులు గాదే పాక మరియమ్మ, గాదేపాక వైష్ణవి, రాములమ్మ, పార్వతమ్మ, ఈరమ్మ, వెంకటేష్, రవితేజ, జలందర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు ప్రతిజ్ఞ ఓటు వినియోగంపై అవగాహన



**ప్రజాపక్షం / ఆలేరు :** మండల సమైక్య సమావేశంలో బుధవారం ఓటర్ ప్రతిజ్ఞ ఓటు వినియోగం పై ఏపిఎం మీనా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాలలో స్కూల్లో ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు గురించి మహిళలు స్కూలు యూనిఫాంల స్టిచ్చింగ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ ఐబి మల్లేశ, శ్రీనిధి, మేనేజర్ సంతోష్, సీసీలు సరస్వతి, శివకుమార్ పాల్గొన్నారు.

## బిఎంఆర్ఎస్ స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఫేర్ కార్యక్రమం



**ప్రజాపక్షం / మోటకొండూర్:** చెంగిచర్లలోని బిఎంఆర్ఎస్ స్కూల్‌లో సైన్స్ ఫేర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి మోటకొండూర్ మండలానికి చెందిన యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నెమ్మని సుబ్రమణ్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన అయోధ్య శ్రీరామ మందిరం, సమ్మక్క, సారక్కల గద్దెలు, ఇతర ప్రాజెక్ట్ మొదలగు ఎక్స్ బిషన్ ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు సీత రాముల వేషధారణ ధరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం మాట్లాడుతూ సైన్స్ ఫేర్ కార్యక్రమంలో బిఎంఆర్ఎస్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారని, సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు తమలోని నైపుణ్యం, ప్రతిభను వెలికి తీయడం అభినందనీయమని అన్నారు. బిఎంఆర్ఎస్ స్కూల్ చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి, డైరెక్టర్ బొప్పిడి జయంత్ రెడ్డి, ఉపాద్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిరు దాన్యాలు ఆరోగ్యానికి మేలు

### ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి



**ప్రజాపక్షం / మోటకొండూర్:** గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిరు దాన్యాలు తినడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని గర్భిణీలు, బాలింతలు అదిక మోతాదులో చిరుదాన్యాలు తినాలని ఆలేరు ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి తెలిపారు. ఆమే బుదవారం మోటకొండూరు మండలంలోని చాడ అంగన్వాడి కేంద్రాల ఆద్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో పాల్గొని తల్లులకు, గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు గోపి

**ప్రజాపక్షం / ఆలేరు :** ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకులు జిల్లా కార్మిక ఉద్యమ నాయకుడు కామ్రేడ్ తీరందాసు గోపి అని సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ అన్నారు. బుధవారం ఆలేరు పట్టణంలో గోపి ఏడవ వర్ధంతి సభ నిర్వహించి ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల కోసం, కార్మికుల కోసం ఆలోచించే వ్యక్తి యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాలో బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం కోసం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దుపటి వెంకటేష్, సిఐటియు జిల్లా నాయకులు మొరిగాడి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పౌల్, ఘనగాని మల్లేష్, తాళ్ల పల్లి గణేష్, రాజేష్, లక్ష్మీ నారాయణ, గణేష్, సుదర్శన్, బాలరాజు, అశోక్, అంజయ్య, యాదగిరి, కృష్ణ, హనుమంతు, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారునికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి



**ప్రజాపక్షం / నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎంతోమంది కళాకారులు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు తమ కళాలకు గళాలకు పదును పెట్టిన ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర శ్రీను, జిల్లా అధ్యక్షులు పందిరి సైదులు ప్రభుత్వాన్ని కోరారు. కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజలని భాగస్వామ్యం చేయడంలో వివిధ కళాకారుల కళారూపాలే ఎంతో ప్రాధాన్యత చేకూర్చాయని అన్నారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కేవలం 550 ఉద్యోగాల అవకాశాలు కల్పించి అందులో కూడా అనర్హులైన వారిని కళాకారులుగా అవకాశం కల్పించి తమ లాంటి కళాకారులను తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హత కలిగినటువంటి ప్రతి ఉద్యమ కళాకారునికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వయసు మీద పడిన వృద్ధ కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దొరపల్లి లత, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు అంజి, జిల్లా ఉపాధ్యక్షులు కోడి భీం ప్రసాద్, జిల్లా కోశాధికారి కంచి శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి నల్ల శ్రీను, కందుల సైదులు,ఆకారపు లింగన్న,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## వివాదాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం / హాలియా:** వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారు వివాదాలకు దూరంగా ఉండాలని మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు అన్నారు. బుధవారం హాలియా పోలీస్ స్టేషన్లో నియోజకవర్గంలోని నిడమనూరు, త్రిపురారం, హాలియా మండలాలలోని వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న నేరస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ కేసులలో ముద్దాయిలుగా ఉన్న వారు చట్టానికి వ్యతిరేకంగా పాల్పడితే వారిపై మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందువలన వివిధ కేసులలో నేరస్థులుగా ఉన్నవారు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హాలియా ఎస్ఐ సతీష్ రెడ్డి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం / నార్కట్‌పల్లి:** జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని నార్కట్‌పల్లి ఎంపిటిసి పాశం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రి ని చేయాల్సిన బాధ్యత మనందరి పై ఉన్నదన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్కట్ పల్లి కాంగ్రెస్ ట పట్టణ అధ్యక్షులు భరత్, పార్టీ సీనియర్ నాయకులు సట్టు సత్తయ్య, ఐ.యాదయ్య, వాజీద్,ప్రజ్ఞాపూరం సత్యనారాయణ, సమ్మద్, బిక్షపతి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ పొందాలి



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఆస్తి పన్ను వసూలుకు మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. బుధవారం పట్టణంలోని పది మంది భారీగా బకాయిలు ఉన్న వారి సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలు చెల్లించాలని, మార్చి 31 వరకు ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ పొందాలని కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఈదులగూడ పెట్రోల్ బంక్, రామచంద్రగూడెంలోని మినా ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి బకాయిలు చెల్లించాలని కోరగా యాజమాన్యం ఒకట్రెండు రోజుల్లో చెల్లిస్తామని గడువు కోరడంతో చెల్లించకుంటే జప్తు చేస్తామని హెచ్చరించామని తెలిపారు.

## ఎన్నికల కోడ్‌తో ఎంఎల్ఎ కార్యాలయ గేట్లకు తాళాలు



**ప్రజాపక్షం / మిర్యాలగూడ:** ఎన్నికల కోడ్ అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రెండు గేట్లకు రాజకీయ కార్యకలాపాలకు అవకాశం లేదని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున క్యాంపు కార్యాలయంలో ఎలాంటి పార్టీ సమావేశాలు, కార్యక్రమాలు ఉండవని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించి సహకరించాలని ఫ్లెక్సీలను పెట్టారు. ఈ నెల 17న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి , ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడిన విషయం పత్రికల్లో ప్రముఖంగా రావడంతో జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పందించి మిర్యాలగూడ నియోజకవర్గం అధికారులకు సమావేశంపై వివరణ తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఫ్లెక్సీ పెట్టారు. వాస్తవంగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే గతంలో లాగా పార్టీ కార్యకలాపాలు పార్టీ ఆఫీసులో నిర్వహించుకోవాలి అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ఎలాంటి సమావేశాలు పెట్టమంటూనే సమావేశం నిర్వహించడంతో ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లింది.

## బిజెపి చండూరు మండల అధ్యక్షుడుగా ఆంజనేయులు



**ప్రజాపక్షం / చండూరు:** భారతీయ జనతా పార్టీ చండూరు మండల అధ్యక్షుడుగా చామలపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఆంజనేయులు నియమితులైయారు. బుధవారం నల్లగొండలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వ ర్షిత్‌రెడ్డి చేతుల మీదుగా తమ నియామక పత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడుగా ఎన్నికైన ముదిగొండ ఆంజనేయులు మాట్లాడుతూ చండూరు మండలంలో పార్టీ అబివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. రాబోవు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. తమ ఎన్నికకు సహకరించిన గంగిడి మనోహర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గోలి మధుసుధన్‌రెడ్డి, బిజెపి మునుగోడు ఇంచార్జ్ దూడల బిక్షంగౌడ్, కోమటి వీరేశం, దర్శణం వేణు,కాసాల జనార్ధన్‌రెడ్డి,సోమ నర్సింహ్మా తడకమళ్ళ శ్రీధర్ పాల్గొన్నారు.

## బిజెపి చండూరు పట్టణ అధ్యక్షుడుగా పందుల సత్యంగౌడ్



**ప్రజాపక్షం / చండూరు మున్సిపాలిటీ :** భారతీయ జనతా పార్టీ చండూరు మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడుగా చండూరు పట్టణానికి చెందిన పందుల సత్యం గౌడ్ ఎన్నికైయారు. బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి చేతుల మీదుగా పందుల సత్యంగౌడ్ తమ నియామక పత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా పందుల సత్యంగౌడ్ మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీ పరిధిలో బిజెపి అబివృద్ధి కొరుకు తమ వంతు కృషి చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, భువనగిరి బిజెపి ఎంపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇంచ్చార్జీ దూడల భిక్షంగౌడ్, కాసాల జనార్ధన్‌రెడ్డి, కోమటి వీరేశం,సోమ నర్సింహ్మా,దర్శణం వేణు, బోడ ఆంజనేయులు,తడకమళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి ఎంపి అభ్యర్థిగా జహంగీర్ ప్రకటన పట్ల హర్షం



**ప్రజాపక్షం / రామన్నపేట:** పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా ఎండి.జహంగీర్‌ను ప్రకటించడం పట్ల సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు గాదె నరేందర్, బావండ్లపల్లి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. భువనగిరి జిల్లాలో ఎల్లప్పుడు బీద, బడుగు బలహీనవర్గాల ప్రజల, కార్మికుల, రైతుల సమస్యల కోసం ఎల్లప్పుడు పోరాటాలు చేసే బీద అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్‌లో కమ్యూనిస్టులు ఉంటేనే నియోజవకర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

## లక్కినేనిగూడెం అంగన్‌వాడీలో పోషక పక్వాడ కార్యక్రమం



**ప్రజాపక్షం / చండూరు :** చండూరు మున్సిపాలిటీ లోని లక్కినేనిగూడెం అంగన్వాడీ సెంటర్‌లో సోషక పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లల తల్లులను ఉద్దేశించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.సుజాత మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలని తల్లులకు, గర్భిణీలకు సూచించారు. చిరుధాన్యాలు, పప్పులు , ఆకు కూరలు, కూరగాయలు ప్రతి రోజు తినే ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. పోషక ఆహారం మంచిగా గర్భిణి తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని , రక్తహీనత లేకుండా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కర్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పి.సునిత, ఎస్‌కె సానియా, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన తుమ్మలపల్లి శ్రీ రామలింగేశ్వస్వామి బ్రహోత్సవాలు

**ప్రజాపక్షం / చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వ స్వామి బ్రహోత్సవాలు ఈ నెల 20 నుంచి 27 వరకు జరుగనున్నాయని దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ కె.మహేందర్ కుమార్, కార్యనిర్వహణాధికారి జిల్లేపల్లి జయరామయ్యలు తెలిపారు. మార్చి 22 శుక్రవారం రాత్రి తెల్లవారితే శనివారం రోజు 3.26 నిమిషాలకు స్వామివారి కళ్యాణం, మార్చి25 సోమవారం రాత్రి తెల్లవారితే మంగళవారం 5.15 నిమిషములకు రథోత్సవము, మార్చి 26 మంగళవారం రాత్రి తెల్ల వారితే బుధవారం రోజు 5.15 నిషములకు అగ్నిగుండాలుకార్యక్రమాలతో బ్రహోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి.

## అక్రమ వసూళ్ళపై ఇఒకు ఫిర్యాదు

**ప్రజాపక్షం / కొండమల్లేపల్లి:** మల్లేపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం నిర్వహించే పశువుల సంతలో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణానికి చెందిన అందుగుల వెంకటేష్, ఓర్సు శ్రీను, బుడిగెపాక కోటి బుధవారం పంచాయతీ కార్యదర్శి ఈవోకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ అక్రమంగా వసూళ్ళు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని అతని వద్ద నుండి అక్రమంగ వసులు చేసిన డబ్బులను రికవరి చేసి గ్రామపంచాయతీ అభివృద్ధికి ఉపయోగించాలని వారు కోరారు.

## పెండ్లిపాకలలో మెడికల్ క్యాంపు

**ప్రజాపక్షం / కొండమల్లేపల్లి:** మండల పరిధిలోని పెండ్లీపాకల గ్రామంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. ఉషారాణి సిబ్బందితో కలిసి మెడికల్ క్యాంపును నిర్వహించారు. గ్రామంలో జ్వరం, దగ్గు, జలుబు, వంటినొప్పులు గల వారికి మలేరియ, డెంగ్యూ జ్వర పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు అందజేశారు. 100 మంది క్యాంపుకు హాజరుకాగా అందులో అవసరమయిన 35 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో పల్లె దవాఖానా డా. జబ్బార్, సిహెచ్‌వో అన్నమ్మ, హెచ్ఈవో హావిల్‌కుమార్, హెచ్‌ఎస్ రాణి, ఏఎన్ఎం తిరుపతమ్మ, స్వాతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషణ పక్షం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని చిట్టెంపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పరిధిలోని మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించడం పోషన పక్షంలో భాగమని, చిన్నారులకు బరువు, ఎత్తు చూసి వారు పోషణ గురించి వివరించడం జరిగింది. గర్భిణిలు, బాలింతలు చిరుధ్యానాలు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ యాదమ్మ, గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## తిరుమలగిరిని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తా



ప్రజాపక్షం/తిరుమలగిరి: తిరుమలగిరి మున్సిపాలిటిని సూర్యాపేట జిల్లా లోనే మోడల్ మున్సిపాలిటిగా అభివృద్ధి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అవిశ్వాసం నెగ్గినంతరం కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలో నూతనంగా మున్సిపాలిటీలన్నింటిలో తిరుమలగిరిని ప్రత్యేకంగా అభివృద్ధి కోసం నిధులను కేటాయించి మోడల్ మున్సిపాలిటిగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకచొరవ చూపెడతానని చెప్పారు. గత ప్రభుత్వంలో తిరుమలగిరి మున్సిపాలిటితో పాటు మండల అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని ఆయన అన్నారు. మున్సిపాలిటీలకు నిధులు లేక నిరాసించిపోయిందని చెప్పారు. ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వమని ప్రజలతో పాటు గ్రామ,మండల,మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించి నిధులు మంజూరు చేస్తారని ఆయన తెలిపారు. తమది ప్రజాపాలన ప్రభుత్వమని ఈ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని ఆయన అన్నారు. తాను తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కౌన్సిలర్లే గత పాలకవర్గం ఒంటెద్దు పోకడ అవినీతిపాలన మూలంగా విసిగి వేసారిపోయి వారే కడుపు మండి అవిశ్వాస తీర్మానం పెట్టారు తప్ప అందులో తమ ప్రమేయంతో పాటు ఎవరిని ఒత్తిడికి గురిచేయలేదని ఆయన తెలిపారు. ఇకనైనా ఒత్తిడికి గురిచేసినట్లు ఆరోపణలు వస్తే సహించేదిలేదన్నారు. ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు అధికారులకు,సిబ్బందికి స్వేచ్ఛ లభించిందని ఆయన అన్నారు. మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికి విజయం సాధించిన కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ నాయకులందరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,కౌన్సిలర్లు ఎల్సోజ్ నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమిలాల్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య, సుంకరి జనార్ధన్, దాచేపల్లి వెంకన్న, తిరుమణి యాదగిరి, కందుకూరి లక్ష్మయ్య, మొగుళ్ల జితేందర్, బత్తుల శ్రీనివాస్, చాగంటి అనసూయ రాములు, కుదురుపాక శ్రీలతరాములు, పత్తెపురం సరిత,నాగార్జున, కేసిడి సరళ, యాదవరెడ్డి,కన్నెబోయిన రేణుక లక్ష్మయ్య, చిరబోయిన హనుమంతు,గిలకత్తుల ప్రియలతా రాముగౌడ, పొన్న రాజ్యలక్ష్మీ ,భాస్కర్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలి



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: విద్యార్థులు వత్తిడిని అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా షీటీం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు బుధవారం త్రివేణి డిగ్రీ కళాశాలలో జిల్లా షీటీం, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులు రక్షణ చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం లాంటి అంశాలపై వివరించారు. విద్యార్థుల సమస్యలుంటే ఉపాధ్యాయుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకుపోవాలని, మానసిక ధైర్యం కలిగి ఉండాలని, అనుకూల, ప్రతికూల సమయాల్లో స్పందించేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల వలలో పడవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఎటిఎం క ఆర్డు వివరాలు, ఒటిపి వివరాలు ఇతరులకు చెప్పవద్దని అన్నారు. ఏదైన ఇబ్బందులు కలిగితే వెంటనే సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, కరస్పాండెంట్ జనార్ధన్‌రెడ్డి, డైరెక్టర్ అనిల్, షీటీం బృందం జాఫర్, శివరాం, యల్లయ్య, గోపి, చారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ



ప్రజాపక్షం/నడిగూడెం: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కె. సీతాలక్ష్మీ ఆదేశానుసారం గురుకుల విద్యాలయ సంస్థ పంపిణీ చేసిన ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్, తెలుగు డిక్షనరీలను బుధవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలోని విద్యార్థులకు ప్రిన్సిపల్ సిహెచ్ ధనవిజయలక్ష్మీ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిక్షనరీలను ఉపయోగించుకుని విద్యార్థులు తమ యొక్క నైపుణ్యాలను ఇంగ్లీష్‌లో పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రేణుక, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రవికృష్ణ, లైబ్రేరియన్ సిహెచ్ నాగరాజు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తులు

ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్: యస్సీ స్టడి సర్కిల్‌లో ఉపాధ్యాయ, నియామకాల డిఎస్సీ కోసం సూర్యాపేట, జనగాం జిల్లాల నుండి 100 మంది షెడ్యూల్ కులముల అభ్యర్థులకు ఏప్రిల్ 3వ తేదీ నుండి జూన్ 2వ తేదీ వరకు రెండు నెలల పాటు ఉచిత రెసిడెన్సియల్ కోచింగ్‌ను తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల స్టడీ సర్కిల్ హైద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి లత, స్టడీ సర్కిల్ హనరరీ డైరెక్టర్ చిట్టిపాక రాములు తెలిపారు. అభ్యర్థులు డిఐఇటి,డిఇడి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, టెట్ నందు తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

## తనిఖీలో రూ.3,03,00 నగదు స్వాధీనం



ప్రజాపక్షం/కోదాడరూరల్: లోక్ ఎన్నికల్లో భాగంగా అంతరాష్ట్ర చెక్ అయిన మండలంలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి,పోలీస్ సిబ్బందితో కలిసి విజయవాడ నుండి హైదరాబాద్ వెపు వెళ్తున్న వాహనాల తనిఖీలు నిర్వహించగా ముగ్గురి వద్ద నుండి రూ.3,03,000 లు స్వాధీనం చేసుకుని ప్రత్యేక విభాగం ఎస్ఎస్‌టీం అధికారి ఎల్.విజయ్ కుమార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమం



ప్రజాపక్షం/కోదాడరూరల్: మండలంలోని రామలక్ష్మీ పురం, గణపవరం గ్రామాల్లో బుధవారం పశువులకు ఉచిత గాలికుంటు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ నాగేంద్రబాబు తెలిపారు.గాలికుంటు నివారణ టీకాల పనితీరును ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డా.సురేష్ పరిశీలించారు.184 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు, పశుపోషకులుఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర,పశువైద్య సిబ్బంది ఖాన్, హుస్సేన్,శరత్,రైతులు కొప్పుల వెంకటరెడ్డి,చిన్న వెంకటరెడ్డి,వీరారెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాపక్షం/కోదాడ రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి విలేకర్లకు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మంగలితండా గ్రామశివారులో పాలేరువాగు నుండి కోదాడకు ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను దొరకుంట గ్రామశివారులో పట్టుకుని ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## విఆర్ఎ మృతి బాధాకరం



ప్రజాపక్షం/మునగాల: గణపవరం విఆర్ఏ నాగేశ్వరరావు మృతి చాల బాధకరమని వైస్ ఎంపిపి కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు మృతదేహంపై పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడు భార్యకు పదివేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, సీనియర్ అసిస్టెంట్ సంజీరావు, రికార్డు అసిస్టెంట్ శంకర్, మాజీ ఎంపిటిసి అమరగాని మట్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జిగా జగదీశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నియోజకవర్గ బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది.ఈ సమావేశంలో బిఆర్ఎస్ నియోజకవర్గ నూతన ఇంచార్జి తాత్కాలిక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తారని పలువురు బిఆర్ఎస్ నేతలు ఆశించినప్పటికి పార్లమెంట్ ఎన్నికల నేపధ్యంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గ బాధ్యతలను చూస్తారని వెల్లడించడం జరిగింది. సమావేశంలో పలువురు నాయకులు పార్టీ వీడిన నాయకుడిని విమర్శించకుండా సమర్ధించినట్లు మాట్లాడటంతో సమావేశానికి వచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఇబ్బంది పడ్డారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, హుజూర్‌నగర్ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి పునర్వైభవం తీసుకవచ్చేలా నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థికి తగిన మెజార్టీ తీసుకరావాల్సిందిగా పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి,కంచర్ల భూపాల్‌రెడ్డి, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## 18 మంది హిజ్రాల బైండోవర్



ప్రజాపక్షం/తుంగతుర్తి: ఈ నెల 18న మండల కేంద్రంలో గ్రూపులుగా విడిపోయిన హిజ్రాలు డబ్బులు వసూలు చేసుకునే క్రమంలో గొడవలు జరిగి మెయిన్‌రోడ్డుపై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వారిపై స్థానిక ఎస్ఐ పబ్లిక్ స్థలంలో ప్రజలకు శాంతి విఘాతం కలిగించే విధంగా చేసినందుకు వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా 18 మంది హిజ్రాలను తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. పబ్లిక్ స్థలంలో ప్రజలు ఇబ్బంది పడే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.